## క్లుప్తంగా

### ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు పెరగాలి



**నూజెండ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలతో సమావేశం గురువారం జరిగింది. విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 20వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థుల సంఖ్య పది శాతం అదనంగా నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆకర్షితులయ్యేలా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వివరించాలన్నారు. కార్యక్రమంలో రెండవ ఎంఈఓ రవిచంద్ర, వివిధ ఉపాధ్యాయ యూనియన్ల నాయకులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కే-రిడ్జిలో గ్రాడ్యుయేషన్ డే



**నరసరావుపేట ఈస్ట్:** గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో గురువారం కిండర్ గార్డెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తులు, టోపీలు ధరించి వేదికపై నడుస్తూ చూడ ముచ్చటగా కనిపించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జి.బర్నబాస్ గ్రాడ్యుయేషన్ డే డిప్లొమోలను చిన్నారులకు అందచేశారు. ప్రీ ప్రైమరీ చిన్నారులు సర్టిఫికెట్లు అందుకోవటం వారికి సంతోషకరమైన రోజుగా చైర్మన్ నాతాని తెలిపారు.

### వ్యర్థాల సేకరణకు రేపు ప్రత్యేక స్టాల్

**నరసరావుపేట:** పట్టణ ప్రజల నుంచి ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల సేకరణకు స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కు వద్ద శనివారం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు గురువారం పేర్కొన్నారు.

### గుంటుపాలెం నివాసంలో చోరీ

**శావల్యాపురం:** మండలంలోని గుంటుపాలెం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో జొరబడి రూ.ఒక లక్ష 40 వేలు నగదు వెండి, బంగారు వస్తువులు చోరీ చేసిన సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వీరవల్లి వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులు ఉపాధి పనులు నిమిత్తం ఉదయం సమయంలో అందరు వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు బైకుపై వచ్చి ఇంటి అలమరపై ఉంచిన తాళాలు తీసి ఇంటిలో బీరువాలోని నగదు తదితరవన్నీ చోరీ చేశారు. చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులు బైకుపై పారిపోవటం స్థానికులు గమనించారు. విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వెల్లడించారు.

### దివ్యాంగుడు అదృశ్యంపై కేసు నమోదు



**నాదెండ్ల:** ఈ నెల 6 నుంచి కనిపించకుండా పోయిన దివ్యాంగుడు (మూగ) పఠాన్ మొహిద్దీన్‌ఖాన్ ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు అప్పాపురం గ్రామానికి చెందిన 50 ఏళ్ళ వయస్సు గల దివ్యాంగుడు పఠాన్ మొహిద్దీన్ ఖాన్ ఈ నెల 6న ఎండుగుంపాలెంలో జరిగిన అక్కాయకుంట తిరునాళ్లకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించారు. ఫలితం లేకపోవటంతో అతని బంధువు పఠాన్ జాన్‌సైదా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన మొహిద్దీన్‌ఖాన్ విబేధాల కారణంగా భార్యకు దూరంగా ఉంటుండగా, కుమార్తెకు వివాహమైంది. ప్రస్తుతం తల్లి సంరక్షణలో ఉంటున్నాడు. ఆచూకీ తెలిసిన వారు 9440900881 నంబరులో సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

### కుమారి టీచర్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి



**చిలకలూరిపేట:** పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు తురక కుమారి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. 2010 నవంబర్ 8న సెకండ్‌గ్రేడ్ టీచర్‌గా మున్సిపల్ బాలికల పాఠశాలలో చేరిన ఆమె శారదా, రజక కాలనీ, నెహ్రూనగర్, మర్రి చెన్నారెడ్డి, రాగన్నపాలెం పాఠశాలల్లో పనిచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగు స్కూల్ అసిస్టెంట్లకు లభించిన పదోన్నతుల్లో భాగంగా ఆమెకు ప్రమోషన్ లభించింది. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నప్పుడే ఆమె ఇంగ్లీషు రైమ్స్‌లో సీడీ తయారు చేసి విద్యార్థులకు నేర్పటం ద్వారా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. లోకల్ క్లాస్‌రూం యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి పాటలు, పద్యాలు, నాట కాల రూపంలో విద్యార్థులకు సులువుగా బోధించటం వంటి కార్యక్రమాలు నిర్వహించిన ఆమెకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి లభించటం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# శాశ్వత మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలి

- అధికారులకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకుల వినతి
- మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

**నరసరావుపేట:** ఆప్కాస్‌ను రద్దుచేసి మున్సిపల్ కార్మికులు అందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మున్సిపల్ కమిషనర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్ అహ్మద్ మాట్లాడుతూ గత సమ్మె కాలం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జీవో నంబరు 30 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులు అందరికీ స్కిల్, సెమిస్కిల్ వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులకు సరైన సెలవులు లేకపోవటం వల్ల వారందరూ అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో పర్మినెంట్ ఉద్యోగులకు సరెండర్ లీవులు మంజూరు చేయాలని, పండగ, క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరారు. ఆప్కాస్‌లో నియమితులైన వారికి, ప్రత్యేకంగా నియమితులైన వారందరికీ మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న మాదిరిగానే నెలకు రూ.21 వేల జీతాలు చెల్లించాలని కోరారు. ఎం.వీరకుమార్, పాపారావు, మరియదాసు, లత, మల్లీశ్వరి, చంటి, చందు పాల్గొన్నారు.

# కొనసాగిన అగ్నిమాపక వారోత్సవాలు



వినుకొండలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**వినుకొండ:** అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా 4వ రోజు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల నిర్మల ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నందు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు, ఉపాధ్యాయులకు స్కూల్ సిబ్బందికి వేసవి కాలంలో పాఠశాల తరగతి గదుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఏ విధంగా వాటి నుంచి బయటపడాలనేది రెస్క్యూ పద్ధతులు, సీఆర్‌పీ చేయు పద్ధతి డెమో ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాలు జరిగిన తరువాత ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలని తెలియజేయడమైనది. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి బి. నాగేశ్వరరావు, సిబ్బంది కె. శ్రీనివాసరావు, రమణారెడ్డి, కె.రవి కుమార్, కేశవబాబు, జి. ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లికార్జునరావు, రామకృష్ణారావు, బాషాఖాన్, మస్తాన్‌వలి, శ్రీను పాల్గొన్నారు.

**చిలకలూరిపేటలో...**

**చిలకలూరిపేట:** ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక పరికరాలు ఉపయోగించటం పట్ల అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి ఎస్ కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సెయింట్ చార్లెస్ హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల గురించి, అగ్నిమాపక పరికరాల ఉపయోగంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఆందోళన చెందకుండా వాటి నియంత్రణకు కృషి చేయాలని చెప్పారు. అగ్ని ప్రమాదంలో ఎవరైనా గాయపడితే గాయపడిన వారిని సురక్షిత ప్రదేశానికి తరలించటానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ సుందరి, హెచ్‌ఎం సిస్టర్ మేరీ విమల, రోజ్‌మేరి పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆర్థిక పరిపుష్టి

జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య



ఇనిమెళ్ళలో ర్యాలీ చేస్తున్న శిక్షకులు, రైతులు

**ఈపూరు (శావల్యాపురం):** రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే సరైనా మార్గమని ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకులు సైదయ్య అన్నారు. గురువారం ఈపూరు మండలం ఇనిమెళ్ళ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామంలోని రైతులు రైతు కూలీలు ప్రతి ఒక్కరు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వ్యవసాయ భూముల్లో కార్బన్ శాతం 0.5 శాతం తక్కువగా ఉందని దీనివల్ల రైతులు వాడే రసాయనిక ఎరువులు పంటలు తీసుకొని స్థితిలో లేవని చీడపీడలు అధికంగా వ్యాపిస్తాయన్నారు. రైతులు పెట్టుబడులు తగ్గించాలంటే ప్రకృతి వ్యవసాయం విధానంలో భూమిని సారవంతం చేసేందుకు పీఎండీఎస్ (నవధాన్యాలు) ఆచరించటం ద్వారా భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. భూమి సారవంతంగా ఉండాలన్నా ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజాన్, సీతారామయ్య, యూనిట్ ఇంచార్జ్ సిరంపల్లి ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్ భాస్కరరావు, తిరుపతిరావు, శివలక్ష్మి, నాగరాజు, లక్ష్మానాయక్, వీరాంజనేయులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- ముస్లిం మైనార్టీల హక్కులు హరించే కుట్ర
- వక్ఫ్ ఆస్తులు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రణాళిక
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ధ్వజం



మాట్లాడుతున్న మారుతీవరప్రసాద్

**చిలకలూరిపేట:** వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, దీంతో ముస్లింలకే కాక, రాజ్యాంగానికి తీవ్ర ప్రమాదమేనని, ఇది ముస్లిం మైనార్టీల హక్కులను హరించివేసే కుట్ర అని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ కార్యాలయంలో గురువారం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ముస్లిం పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి హాజరైన మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ బోర్డు బిల్లు ను సవరిస్తూ ఉభయ సభల్లో ఆమోదం చేసుకుందన్నారు. వక్ఫ్ ఆస్తులు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్రల్లో భాగమే చట్ట సవరణ చేస్తున్నారని విమర్శించారు. మతతత్వ విధానాలను రాజ్యాంగంలోకి చొప్పించి ముస్లింల హక్కులను హరించే చర్యలకు పాల్పడడం విచారకరమన్నారు. వక్ఫ్ బిల్లును తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మసీదు విధ్వంసాలు, మూక హత్యలతో హిందూత్వ శక్తులు అరాచకం సృష్టిస్తుండటం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పుడు కొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని ఆరోపించారు. లౌకికవాదులంతా ఏకమై కేంద్రంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు నిర్దేశించిన చట్టాన్ని కాపాడుకునేందుకు మైనార్టీలు అందరూ ఐక్యం కావాలని కోరారు. ముస్లిం మైనార్టీ హక్కుల కోసం జరిగే పోరాటాల్లో మద్దతు ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ఆస్తులు కబ్జా చేయటమే కాకుండా ఆస్తుల్ని దుర్మార్గంగా కాజేసేందుకు కుట్ర పన్నుతుందని పేర్కొన్నా రు. లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న కొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వక్ఫ్ చట్టాన్ని బలపరచటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డిలు మాట్లాడుతూ హిందుత్వ మతోన్మాద ఎజెండా అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. ముస్లిం నాయకులు ముఫ్తీ అనస్‌ఖాన్, ముఫ్తీ ఖలీల్‌ఖాన్‌లు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో 25 ,29 ,30 నిబంధనకు వ్యతిరేకంగా చట్టం చేయబడిందని, మసీదులు, దర్గాలు, శ్మశానాలు ఇప్పటికే ప్రమాదంలో పడ్డాయన్నారు. సవరణ చట్టం ద్వారా లక్షల ఎకరాల ఆస్తులను కొల్లగొట్టే కుట్రలను కులమతాలకు అతీతంగా తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు మాట్లాడుతూ తమ స్వార్థ ప్రయోజనాల కోసం వక్ఫ్ చట్టాన్ని సవరించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులన్నీ కూడా ఎవరో ముస్లిం దాతలు ఎప్పుడో తమ అభీష్టం ప్రకారం ముస్లిం సమాజం కోసం దానం చేసిన ఆస్తులే కానీ ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు కావని, యువత ఈ అంశంపై అవగాహన కలిగి ఉండి ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, జన క్రాంతి పార్టీ అధ్యక్షులు షేక్ గౌస్, వీసీకే పార్టీ నాయకులు వంజా ముత్తయ్య, ప్రజాసంఘాలకు చెందిన బాజీ,మస్తాన్ వలి, జబ్బార్, యాసిన్, కరిముల్ల, జిలానీ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

# హెచ్‌టీ పత్తివిత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

**నరసరావుపేట రూరల్:** పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ కార్యాలయ అగ్రిల్యాబ్ ఏడీఏ ఆర్.శశిధర్‌రెడ్డి, ఏడీఏ మస్తానమ్మ, ఏవోలు విన్.సురేసన్, నరేంద్రాబులు పాల్గొన్నారు. విత్తన దుకాణాల్లో పత్తి నిల్వలను పరిశీలించారు. నిషేధిత హెచ్‌టీ పత్తి విత్తనాల నిల్వలు, అమ్మకాలపై ప్రత్యేక దృష్టిసారించారు. కలుపు మందును తట్టుకునే హెచ్‌టీ పత్తి విత్తనాల నిల్వలు, అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతి లేదని అధికారులు తెలిపారు. ఈ రకం విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి ఉన్న రకం విత్తన నిల్వలు వచ్చిన వెంటనే మండల వ్యవసాయ అధికారికి సమాచారం అందించి వారి అనుమతితో విక్రయాలు జరపాలని తెలిపారు. ప్రతి విత్తన డీలరు రైతులకు తప్పని సరిగా విత్తన కొనుగోలు రసీదు ఇవ్వాలని తెలిపారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ డీలర్ల గుర్తింపు పొందిన డిస్ట్రిబ్యూటర్ వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల



**వినుకొండ :** మండలంలోని మదమంచిపాడులో గల వీరాంజనేయస్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో తరలి వెళ్లి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు విజయవాడ - హైదరాబాద్ వేస్ట్ పేపర్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలను సందర్శించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బొల్లా మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా ప్రత్యేక తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలలో చేర్పించాలంటూ ఉపాధ్యాయుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో

**రొంపిచర్ల:** మండలంలోని మాచవరం గ్రామంలో గురువారం పాఠశాల అప్‌గ్రేడ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరణ చెందిందని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో డి.బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరణ చెందిందన్నారు. తల్లిదండ్రులు 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న తమ పిల్లలను స్కూల్లో చేర్చాలని కోరారు. నూతనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరణ చెందుతున్న ఈ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. తమ పిల్లలను స్కూల్లో చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రవినాయక్, ప్రధానోపాధ్యాయులు వి. నాగరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అబ్రహం, గ్రామ పెద్దలు యాంపాటి కోటిరెడ్డి, బొబ్బిలి కోటిరెడ్డి, వీవీఆర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేడు బొప్పూడిలో బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం



బొప్పూడి గ్రామంలోని బాజీబాబా దర్గా

**చిలకలూరిపేటటౌన్:** మండలంలోని బొప్పూడి గ్రామంలో వేంచేసి ఉన్న హజరత్ సయ్యద్ బాజీబాబా గారి ఉరుసు మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షులు బాలసైదా(బాబు), బాజీ షాహిద్ బ్యాటరీ వర్క్స్ షేక్ ఖాజా తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉరుసు ఉత్సవం సందర్భంగా బాబావారి దర్గాను కొత్తరంగులతో వివిధ రకాల పూలతో తీర్చిదిద్దామన్నారు. గ్రామం నుంచి దర్గా వరకు రహదారుల వెంట భారీ విద్యుత్ దీపాలంకరణ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుంచే ఉరుసు ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఆదేరోజు రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నదానం కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్ధరాత్రి గంధ మహోత్సవం బయలుదేరి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు జరగనున్నట్లు వెల్లడించారు. అనంతరం శనివారం తెల్లవారుజామున బాబా వారికి ముజావర్ల ఆధ్వర్యాన దీపారాధన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించబడుతుందన్నారు. అనంతరం బాబావారి గంధంతో పాటు పలు రకాల ప్రసాద వితరణ కూడా భక్తులకు అందించనున్నట్లు చెప్పారు.

# గురుకుల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్.సువర్ణకుమారి

**యడ్లపాడు:** మండలంలోని బోయపాలెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, క్రమశిక్షణ, ఆహారపు అలవాట్లపై ఆరోగ్య పరమైన సరికొత్త అంశాలపై అవగాహన అందించారు. సదస్సు అనంతరం జనరల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించి ప్రోత్సహించారు. విద్యాలయ ప్రిన్సిపల్ దాసరి ప్రభాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎస్.సువర్ణ కుమారి, ఉపాధ్యక్షుడు వై. ప్రసాదరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



గణపవరంలో క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

**నాదెండ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యతో చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు తల్లిదండ్రులు ముందుకురావాలని హెచ్‌ఎం విజయలక్ష్మి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హెచ్‌జేబీ పాఠశాలను సందర్శించారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు తమ పాఠశాల నుంచి 28 మందితో కూడిన జాబితాను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు.

గ్రామ పరి ధిలో మొత్తం 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుండగా, వీటిలో సుమారు 120 మందికి పైగా ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మరికొంతమంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు వారి తల్లిదండ్రులను సంప్రదించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15-23 వరకూ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు కల్లూరి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, కె. రత్నరాజు, ఆదినారాయణ, టి.వెంకటేశ్వర్లు, ఐడీబీ నాయక్, బాజీబాబు, ఐ.సాంబశివరావు ఉన్నారు.

### ఏఎంరెడ్డిలో ఘనంగా ఫేర్‌వెల్



శాంతిని సత్కరిస్తున్న విద్యార్థినులు

**నరసరావుపేట రూరల్:** ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో కష్టపడితే జీవితంలో గొప్ప విజయాలను సాధిస్తారని ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఫైనలియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రికెట్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఏ.కిశోర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డిని విద్యార్థులు సత్కరించారు.

# యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు

**శావల్యాపురం:** యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ప్రత్యేకంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక మండల వనరుల కేంద్రంలో గురువారం నిర్వహించినట్లు యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గూడూరి ప్రసాదు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పునులూరి లలితకుమారి, యూటీఎఫ్ సంఘం నేతలు పి.సురేష్, యం.రామకోటేశ్వరరావు, ఎ.చినకోటేశ్వరరావు, యం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ప్రసాద్‌కు అవార్డు లభించటం సముచితం



ప్రసాద్‌ను అభినందిస్తున్న తేళ్ల సుబ్బారావు

**చిలకలూరిపేట:** నాటకరంగంలో విశేష కృషి చేసిన చెన్నకేశవ ప్రసాద్‌కు కందుకూరి అవార్డు లభించటం సముచితమని చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ కందుకూరి వీరేశలింగం అవార్డు అందుకున్న నాటక రంగ కళాకారుడు ప్రసాద్‌కు గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే నాటక రంగంలో ప్రవేశించిన ప్రసాద్ గత ఆరు దశాబ్దాలుగా నాటక రంగ అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే పలు అవార్డులు పొందిన ఆయన భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌కెకె ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.